క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత కంప్యూటర్ శిక్షణకేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని సత్యసాయి సేవా మందిరంలో నిర్వహించే ఉచిత కంప్యూటర్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి సేవాసమితి అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, చిప్ప దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లావ్యాప్తంగా గురువారం తుంపర వానలు పడ్డాయి. జిల్లాలో అత్యధికంగా ఇల్లంతకుంట మండలంలో 6.3 మిల్లీ మీటర్ల వర్షం పడగా చందుర్తిలో 3.1, వేములవాడ రూరల్‌లో 1.2, బోయినపల్లిలో 3.6, వేములవాడలో 0.3, సిరిసిల్లలో 4.3, కోనరావుపేటలో 2.8, ముస్తాబాద్‌లో 2.4, తంగళ్లపల్లిలో 3.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని మిగితా మండలాల్లో పెద్దగా వర్షం వర్షం పడలేదు.

విజయవంతం చేయండి

సిరిసిల్ల అర్బన్: ఈనెల 22న నిర్వహించే చలో గన్‌పార్క్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు మల్లారెడ్డి, పోశెట్టి, శంకర్, ఆంజనేయులు, దత్తాద్రి, చెన్నయ్య పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

కోనరావుపేట: విద్యుత్ కోతుల విధిస్తూ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండిన ధాన్యాన్ని కొనలేక ఇచ్చిన హామీలు పక్కన పెట్టి అటు రైతులు, ఇటు ప్రజలను మోసం చేస్తున్నారని, 3 హెచ్‌పీ నుంచి 5 హెచ్‌పీకి మార్చి ఏటా విద్యుత్ బిల్లు చెల్లించుకుంటూ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేశ్ గౌడ్, నాయకులు దడిగే గంగయ్య, చింతల పరుశురాం, ఎడ్ల సుధాకర్, ఎల్ల రాంరెడ్డి, పాలకుర్తి శ్రీనివాస్, వేల్పుల తిరుపతి, జలందర్, మోతుకు మోహన్, వికాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో న్యాయ దినోత్సవం



వేములవాడ: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా వేములవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో అడ్వకేట్లు కేక్ కట్‌చేసి గురువారం సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. సీనియర్ కోర్టు ఏజీపీ బొడ్డు ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కటకం జనార్దన్, న్యాయవాదులు నేరెళ్ల తిరుమల గౌడ్, గుడిసె సదానందం, జక్కుల పద్మ, సరిత, అన్నపూర్ణ, పాత్తూరు అనిల్‌కుమార్, కోర్ల శ్రీనివాస్, విద్యాసాగర్‌రావు, మాదాసు దేవయ్య, ప్రతాప సంతోష్, మనోహర్, నక్క దివాకర్, హరికృష్ణ, అభిలాష్, మహేశ్‌బాబు, శ్రీనివాస్, మహేశ్, జనార్దన్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు అండగా ప్రభుత్వం

ముస్తాబాద్: గల్ఫ్ కార్మికులు, కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గల్ఫ్‌లో మృతిచెందిన వారి గురించి, మోసపోయిన వారి గురించి ఏనాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో పట్టించుకోలేదన్నారు. గల్ఫ్ కుటుంబాలకు కాంగ్రెస్ అండగా ఉంటుంటే ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు దాడులకు తెగపడుతున్నారన్నారు. ఎన్‌ఆర్‌ఐ సెల్ అంతర్జాతీయ కోఆర్డినేటర్ నంగి దేవేందర్‌రెడ్డి, బొజ్జ అమరేందర్‌రెడ్డిపై బాల్కొండ నియోజకవర్గానికి చెందిన వారు బీఆర్‌ఎస్ నాయకులు దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు.

కొండాపూర్‌కు బస్సు నడపాలి

ముస్తాబాద్: సిద్దిపేట నుంచి ముస్తాబాద్, గూడెం మీదుగా కొండాపూర్, ఎల్లారెడ్డిపేట వరకు ఆర్టీసీ బస్సు నడపాలని సిద్దిపేట డిపో మేనేజర్‌కు గురువారం విజ్ఞప్తి చేసినట్లు కొండాపూర్ గ్రామస్తులు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలాల ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, మహిళలకు ఈ బస్ సర్వీస్ ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట నుంచి కొండాపూర్, ముస్తాబాద్ మీదుగా సికింద్రాబాద్ వరకు బస్ నడపాలని కోరారు. డీఎం సానుకూలంగా స్పందించా రని గ్రామ ఉపాధ్యాయుడు గంగరాజు పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులకు భద్రత ఏది?

- జీపీ కార్మికులకు రక్షణ కవచాలు కరువు
- పొంచి ఉన్న అనారోగ్యం ముప్పు
- ఏడాదిగా అందని సామగ్రి



గంభీరావుపేటలో రక్షణ కవచాలు లేకుండా పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గంభీరావుపేట: గ్రామపంచాయతీల పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు భద్రత కరువైంది. కనీస రక్షణ కవచాలు లేకుండా వారితో పనులు చేయిస్తున్నారు. అసలే వానాకాలం.. వారికి అనారోగ్యంబారినపడే అవకాశం ఉంది. గ్లౌజులు, మాస్క్‌లు, సబ్బులు ఇతర కనీస రక్షణ కవచాలను కూడా ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు అనారోగ్యంబారిన పడే ప్రమాదం ఉంది. ఏడాదిగా పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, షూస్, సబ్బులు, ఇతర లిక్విడ్స్ అందడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు శుభ్రతను అందించేందుకు నిరంతరాయంగా సేవలందిస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు తగిన భద్రత పరికరాలు లేక.. పనులు చేసేందుకు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఏడాదిగా సామగ్రి అందకపోవడంతో వారి ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది.

వ్యాధుల కాలంలోనూ..

రోజూ ముందే వీధుల్లోకి వచ్చే సిబ్బందికి రక్షణ కవచాలు ఉండడం లేదు. వాన, చలి, ఎండ అనే తేడాలేకుండా శ్రమించే కార్మికులకు భద్రత లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యాధుల సమయంలో మురుగు, చెత్త, హానికరమైన వ్యర్థాలతో అంటు వ్యాధులు సోకే అవకాశం ఉంది. భద్రతా పరికరాల లేమి కారణంగా ఇప్పటికే ఎంతోమంది కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారు. అయినా మళ్లీ పనిలో నిమగ్నంకావాల్సి వస్తోంది. ఏటా రెండు జతల యూనిఫాంలు, రెండు జతల షూలు, మాస్క్‌లు, రెయిన్‌కోట్స్, సబ్బులు, శానిటైజర్ల వంటివి ఇవ్వాల్సి ఉంది. మోకాళ్ల లోతు బురదలో దిగి దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ పనులు చేయాల్సిన పరిస్థితి వారిది. వారికి బురదలో తేళ్లు, జెర్రులు, పాములు కరిచే ప్రమాదం ఉంది. డ్రైనేజీలో మురుగును తొలగించే సందర్భంలో మాస్కులు లేకపోవడంతో దుర్వాసనతో కార్మికులు అనారోగ్యానికి గురి కావాల్సి వస్తోంది.

నెలకో.. మూడు నెలలకో..

ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నిధులను బట్టి నెలకో, మూడు నెలలకో రక్షణ కవచాలు సమకూర్చాల్సి ఉంది. ఎన్నో గ్రామాల్లో నిధుల లేమి కారణంగా ఏడాదిగా పారిశుధ్య కార్మికులకు రక్షణ సామగ్రి అందడం లేదు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తగిన రక్షణ పరికరాలు తక్షణమే అందిచాల్సిన అవసరం ఉంది.

సమకూర్చాలని చెప్పాం



పంచాయతీ కార్యదర్శులు తమ జీపీ పరిధుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల కోసం రక్షణ సామగ్రి సమకూర్చాలని చెప్పాం. నిధులను బట్టి కార్మికుల కోసం సామగ్రిని సమకూర్చుతున్నారు. వెంటనే కార్మికుల రక్షణ కవచాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, ఎంపీడీవో

పెన్షన్‌దారులను పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పెన్షన్‌దారులకు పింఛన్ పెంచకుండా కాలయాపన చేయడం సరైందికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ శోభారాణి కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం వృద్ధులు, వితంతువుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 27న సిరిసిల్లలో 10వేల మందితో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు శరవింద్, భగవంతం, అందె శామ్యూల్, అందె చంద్రయ్య, బైరి నరేశ్‌రెడ్డి, రామిండ్ల సంజీవ్, మారపు అంజయ్య, రమేశ్, లక్ష్మణ్, బద్రి, తిరుపతి, గణేశ్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రమేశ్ కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. రాజురావు, శ్రీనివాస్, ధనుష్, కార్తీక్ పాల్గొన్నారు.

బతుకమ్మ తెప్ప స్థల పరిశీలన



స్థలంలో కొలతలు వేస్తున్న పీఆర్ ఏఈ సాయితేజా, తదితరులు

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిధులతో చేపట్టే బతుకమ్మ తెప్ప స్థలాన్ని పీఆర్ ఏఈ సాయితేజారెడ్డి గురువారం పరిశీలించారు. స్థల కొలతలు వేశారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరువాల మహేందర్, అనుముల బాల్‌రెడ్డి, బూర్గుల నందయ్య, నల్లాల మల్లయ్య, నక్క ఉషాలు, సావనపెల్లి కొమురయ్య కూస మహేందర్, రాజయ్య, కొండ పరశురాం, పెంతల లచ్చిరెడ్డి, దూస రాజశేఖర్, ఎల్లయ్య, కనకయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, నక్క రాజీవ్, బన్నీ, సాయికష్ణ తదితరులు ఉన్నారు.

రైతులకు రుణాలు అందజేత

ఇల్లంతకుంట: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎఫ్‌పీఓ రైతు ఉత్పత్తిదారుల సంఘంగా గుర్తించడంలో సొసైటీ సిబ్బంది శ్రమ ఉందని చైర్మన్ గొడుగు తిరుపతి అన్నారు. గురువారం సొసైటీలో 13 మంది రైతులకు రూ.86 లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను అందజేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొదటి విడతగా రూ.3లక్షల 16 వేలను ఎన్సీడీసీ మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా సిబ్బందిని చైర్మన్ తిరుపతి సన్మానించారు. కార్యక్రమంలో ప్యాక్స్ కార్యదర్శి చిట్టి రవీందర్ రెడ్డి, డైరెక్టర్ గజ్జెల సత్యం, సిబ్బంది రవీందర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, రాజేశ్, కే ప్రమోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం నిర్మించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ముస్తాబాద్: క్షయరహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని వైద్యాధికారి గీతాంజలి అన్నారు. మండలంలోని తుర్కపల్లిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ నిర్మూలన సూపర్‌వైజర్ మహిపాల్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నా ఆకలి లేకపోవడం, రాత్రివేళల్లో చమటల పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే క్షయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్ఐవీ కౌన్సెలర్ సురేశ్, ఎల్‌టీ ప్రకాశ్, టీబీ నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవళిక, రమ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



రుద్రంగి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం అన్నారు. గురువారం మండలకేంద్రంలోని గొరిలాల్వ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ మాట్లాడుతూ రైతులకు లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా ఉండేందుకు గతంలో మండలకేంద్రంలో నూతనంగా ఐదు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏఏఈ కుమార్, సెస్ సిబ్బంది దేవయ్య, రైతులు పాల్గొన్నారు.

ఫోన్‌లో పరామర్శ

వేములవాడరూరల్: ఇటీవల నూకలమర్రి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త పెద్దవేని రాజు సౌదీ నుంచి వచ్చి చికిత్స పొందుతూ మృతిచెందగా ఆయన కుటుంబాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం రాత్రి ఫోన్‌లో పరామర్శించారు. బాధితుడి తల్లితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

కేటీఆర్ పరామర్శ



సిరిసిల్ల అర్బన్ : సిరిసిల్లలో ఇటీవల మృతిచెందిన జర్నలిస్ట్ ప్రసాద్ కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. మృతికిగల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువులతోపాటు, కూతురుకు ఉద్యోగ అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ అరుణ, మాజీ కౌన్సిలర్ గెట్యాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు కూల్చివేత



షెడ్డును తొలగించిన అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి గ్రామంలో ఓ రైస్‌మిల్ యజమాని ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్డును ఎట్టకేలకు అధికారులు నేలమట్టం చేశారు. రైస్‌మిల్ సమీపంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా యజమాని నిర్మించిన ఈ షెడ్డును తొలగించాలని కొంతమంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో నెల రోజులుగా విచారణ జరిపిన అధికారులు గురువారం ఆ షెడ్డును తొలగించినట్లు గ్రామస్తులు తెలిపారు.

• 23న విద్యాసంస్థలు బంద్

సిరిసిల్ల అర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ తెలిపారు. గురువారం సిరిసిల్లలో వామపక్ష విద్యార్థి సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. బంద్‌కు అన్ని విద్యాసంస్థలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్, సాయిరాం, అంకిత, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

• ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని డబుల్ బెడ్ రూం కేసీఆర్‌కాలనీలో నివాసముంటున్న చేపూరి శ్రీకాంత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, స్థానిక పవర్ యూత్ సభ్యులు గురువారం వైద్యం కోసం రూ.53వేల ఆర్థికసాయం అందజేశారు. కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శ్రీకాంత్‌ను పరామర్శించి సాయం అందించారు. దాతలు ఫోన్ పే నంబర్ 9550593399లో ఆర్థిక సాయం అందించాలని కోరారు.

• 15 నెలలుగా అందని వేతనాలు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని పలు పోస్టాఫీస్‌లలో పనిచేస్తున్న డాక్ సేవకులకు గత 15 నెలలుగా వేతనాలు అందడం లేదని డాక్ సేవకులు ఆరోపించారు. బోనాల, సారంపల్లి, బస్వాపూర్, చీర్లవంచ, చీకోడు, గజసింగవరం, సిరిసిల్ల, మర్రిగడ్డ, వీర్నపల్లి, ముస్తాబాద్, నామాపూర్, కొండాపూర్, వేములవాడ, బద్దెనపల్లి ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్ సేవకులకు వేతనాలు రావడం లేదని డాక్ సేవకులు ఆంజనేయులు, కార్తీక్ తదితరులు పేర్కొన్నారు.

• హోటల్‌లో చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్ దగ్గరలోని హోటల్‌లో ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. హోటల్‌లో టీ తాగేందుకు వచ్చి కౌంటర్‌లోని రూ.3వేల నగదును ఎత్తుకెళ్లాడు.అనిల్‌రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈవై స్కిల్ బ్రిడ్జ్ ప్రాజెక్టులో భాగంగా ఫైనాన్షియల్ ఎంటర్‌ప్రైజ్ వర్క్‌షాప్ నిర్వహించారు. బ్యాంకింగ్ వ్యవస్థ, వ్యాపార రంగం, ఆర్థిక లావాదేవీలు, ఇన్సూరెన్స్, ఏటీఎం సర్వీసులు, నగదు రహిత లావాదేవీలు తదితర అంశాలపై స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పద్మాదేవి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రాజుగురు హిరేమత్, దూరంగ్, బోసు మల్లిక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలోని ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ ఫ్యూజ్ వైర్ తరచూ కాలిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. డబుల్ ఫీడర్ చేయరు.. ఫ్యూజ్ వైరు వేసే వారు లేరని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు పరిస్థితిని సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
పృథ్వీధర్‌గౌడ్, సెస్ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట, సెల్ : 9440814081

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

'సెస్' అవినీతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న దశరథం

సిరిసిల్లటౌన్: సెస్ సంస్థలో జరిగిన అవినీతిపై అధికారులు విచారణ చేపట్టాలని ఏఐఎఫ్టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సెస్ అవినీతి బాగోతంపై వస్తున్న కథనాలపై స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించాలని కోరారు. సిరిసిల్ల నేతన్నల నుంచి బ్లాక్ బిల్లింగ్‌ను రద్దు చేయిస్తానని దాదాపు రూ.30లక్షలు వసూలు చేసిన సెస్ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. సెస్‌లో జరిగిన అవినీతి బాగోతంపై స్పందించకుంటే స్థానిక ఎన్నికల్లో సెస్ వినియోగదారులను చైతన్య పరిచి తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. దేవదాస్, సత్తయ్య,పండు, మల్లారెడ్డి, కృష్ణహరి పాల్గొన్నారు.

ఆలయ పనులపై కేంద్ర మంత్రికి విన్నపం



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ పునర్‌నిర్మాణ పనులు పూర్తి చేయించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మండల నాయకులు విన్నవించారు. కరీంనగర్‌లో గురువారం కేంద్ర మంత్రిని కలిసిన వారు ఈమేరకు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 11న తిరుపతి స్వామి వారి దర్శనానికి వెళ్లిన సందర్భంగా ఈ విషయమై టీటీడీ ఈవోతో మాట్లాడినట్లు తెలిపారు. వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారని నాయకులు చెప్పారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు సిరిగాథ రమేశ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నంది నరేశ్ పాల్గొన్నారు.

పాఠాలు చెప్పేవారేరి?

- ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు
- అగమ్యగోచరంగా కనగర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పరిస్థితి



కనగర్తిలో ఎస్టీకాలనీ పాఠశాల విద్యార్థులు

కోనరావుపేట: ఆ పాఠశాలలో 23మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. నిరాటంకంగా కొనసాగుతున్న విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటులో భాగంగా డెప్యూటేషన్‌పై వేరే పాఠశాలలకు పంపడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారే కరువయ్యారు. మండలంలోని కనగర్తి ఎస్టీకాలనీలో ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం 23 మంది విద్యార్థులున్నారు. వీరికి పాఠాలు బోధించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రమణారెడ్డిని వీర్నపెల్లి మండలం మద్దిమల్ల ప్రాథమిక పాఠశాలకు, మరో ఉపాధ్యాయురాలు విజయను కనగర్తి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు డెప్యూటేషన్‌పై పంపిస్తున్నట్లు ఆదేశాలు జారీచేశారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు స్వప్నను వీర్నపెల్లి మండలానికి డెప్యూటేషన్ వేశారు.

పిల్లల భవిష్యత్‌పై ఆందోళన

అధికారులు ఇష్టం వచ్చిన రీతిలో ఉపాధ్యాయులను బదిలీ చేయడంతో విద్యార్థులకు కష్టంగా మారింది. కనగర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిని వీర్నపెల్లి మండలానికి, ఎస్టీకాలనీలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని కనగర్తి పాఠశాలకు బదిలీ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్న తమ పిల్లల భవిష్యత్ ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

డిప్యూటేషన్ రద్దుచేయాలి



కోనరావుపేట మండలం కనగర్తిలోని ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీని అధికారులు వెంటనే రద్దుచేయాలి. కొంత మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేట్ పాఠశాలకు బంద్ చేసి ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులను తీసేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

–రావులపెల్లి జ్యోతి, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ఒకే పాఠశాల ఆవరణలో పనిచేస్తూ వేర్వేరు రిజిస్టర్లు నిర్వహిస్తున్న పాఠశాలలను విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్టీ కాలనీలోని ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేశారు. మా పాఠశాలను మా కాలనీలోనే నడుపుకుంటామని అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం ద్వారా తెలిపారు. వారి విషయాన్ని కలెక్టర్‌కు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు పనిచేస్తాం. –మురళీనాయక్, ఎంఈవో, కోనరావుపేట

కారు ఢీకొని గేదె మృతి



కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ సమీపంలో కారు ఢీకొని గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన జవ్వాజి రాజుకు చెందిన గేదెను ఆలయ సమీపంలో ప్రధాన రహదారికి పక్కన కట్టేశాడు. అర్ధరాత్రి రోడ్డుపై వెళుతున్న కారు ఢీకొట్టడంతో మృతి చెందింది. కారు రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వాహన యజమానులు కారును అక్కడే వదిలేసి వెళ్లారు. కాగా సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి: అంకిరెడ్డిపల్లెలో పసుల స్వామి (35) అనే ట్రాక్టర్ డ్రైవర్ గురువారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబబ సభ్యులు స్వామిని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.